'దుర్గయ్యా గుంజలు బాగా లోతుగా పాతించు. పందిరి బలంగా వుండాలి. గాలి వస్తే పడిపోయేటట్లు వుండకూడదు సుమీ. నీ ఇష్టం'' పనివాళ్ళ పనితనాన్ని పర్యవేక్షిస్తూ హెచ్చరించారు వర్ధనమ్మగారు.

''అలాగే నండమ్మా! పందిరి గట్టిగా వుండేటట్లే వేయిస్తాగా'' భరోసా ఇచ్చాడు దుర్గయ్య.

గుంజలు నాలుగు పాతెయ్యడం, వాటిని కలుపుతూ బొంగులు బిగించి కట్టడం, తాటి ఆకులు ఒకటికి రెండు జోడించి అమర్చటం వెంటవెంటనే జరిగిపోయాయి.

ఇద్దరు కుర్రవాళ్ళు పైకి ఎక్కి పైకప్పు పూర్తి చేశారు. ఒక్క అరడజను గడ్డి మోపులు పరచి గాలికి ఎగిరి పోకుండా పురికొసతో బొంగుల్ని కలిపి కట్టివేశారు.

అసలే మండు వేసవి. గ్రీష్మ తాపం తట్టుకోవడం ఏ తరం వారి తరం కావడం లేదు. కొత్తగా తయారైన పందిరిలో చల్లగా, హాయిగా వున్నది.

వర్ధనమ్మగారితో సహా పనివాళ్ళందరూ చల్లని పందిరి క్రింద నిల్చొని కాసేపు ఊరట చెందారు. నేలమీద పడిన చెత్తా చెదారం ఏరి శుభ్రం చేశారు.

తన కోరిక మేరకు నిర్మింపబడిన పందిరిని చూసుకుని సంబరపడి పోయారు వర్ధనమ్మగారు.

మిగిలిన ఏర్పాట్లు సిద్ధం చేసుకు నేందుగ్గాను ఇంటివైపు నడక సాగించిం దావిడగారు. నడి వయసులోనే వైధవ్యం పొందిన వర్ధనమ్మ అనేక పుణ్య స్థలాల్ని దర్శించింది. తరచుగా ఆ వూరి రామాలయంలో జరిగే భజన కార్యక్రమాల్లో పాల్గొనటం, అభిషేకాలు, అర్చనలు, వగైరాలు జరిపించటం, సదరు కార్యక్ర




మాలకు విరివిగా చందాలు సమర్పించడం వర్ధనమ్మగారి అభిరుచులు.

భారత రామాయణాది గ్రంథాల్ని కూలంకషంగా చదివింది. భగవద్గీతను పారాయణం చేసింది.

ప్రతి రోజు విష్ణు సహస్ర నామాలు, లలితా సహస్ర నామాలు చదువుకోనిదే తన దైనందిన కార్యక్రమాలు చేపట్టదు వర్ధనమ్మగారు.

ఆధ్యాత్మిక చింతనకే ఎక్కువ సమయం కేటాయించే వర్ధనమ్మగారికి చాలా కాలంగా ఓ చిరు కోరిక మిగిలి పోయింది. తన కోరికను కొడుకు, కోడలికి తెలియజేసింది. ఆమెను సమాధాన పరచటానికి విఫల యత్నం చేసిన ఆ ఇద్దరూ, వర్ధనమ్మగారి మనసు నొప్పించటం ఇష్టంలేక అంగీకరించారు.

వర్ధనమ్మగారి నేతృత్వంలో వెలిసింది 'చలివేంద్రం'. పది మందికి మంచి నీటిని, అందులోనూ వేసవికాలంలో అందించటం, తద్వారా పుణ్యాన్ని, మోక్షాన్ని కూడా పొందవచ్చుననే నమ్మకం ఆవిడనందుకు ప్రోత్సహించినై.

ఓ నాలుగు పెద్ద పెద్ద బానలు, ఓ అరడజను గ్లాసులు, రెండు జగ్గులు, వగైరా సామాగ్రినంతా తెప్పించారు. నేల మీద ఇసుక పోసి బానల్ని కుదురుగా అమర్చారు. తను కూర్చోవటానికి ఓ కుర్చీ, ఎండలో అలసిపోయి వచ్చినవారు కూర్చునేందుగ్గాను ఇంటిదగ్గర వున్న ఓ పాత బల్ల తెప్పించి చలివేంద్రంలో వేయించారు వర్ధనమ్మగారు.

ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయన్న సంతోషం ఆమె వదనంలో స్పష్టంగా కనిపించింది. చలివేంద్రాన్నంతా మరోసారి పరికించి చూసుకుని తృప్తిగా నవ్వుకున్నారామె.

చలివేంద్రంలో తను సమకూర్చిన సదుపాయాలన్నిటి గురించీ వర్ధనమ్మగారు వివరంగా చెప్తుంటే వింటూ భోజన కార్యక్రమం మొదలు పెట్టాడు కొడుకు.

తెల్లవారి కుళాయిలు రాగానే మంచి నీటిని చలివేంద్రానికి తరలించే కార్యక్రమం గురించిన ఆలోచనలో మునిగిపోయింది వర్ధనమ్మగారు.

''అన్నట్లు మర్చిపోయాను...'' అంటూ కోడలి దగ్గరగా వచ్చింది వర్ధనమ్మగారు.

''రేపట్నించి మన పంపు దగ్గర ఎవ్వర్నీ ఒక్క బిందె కూడా నీళ్ళు పట్టుకు వెళ్ళనీయవద్దు. అన్నీ చలివేంద్రానికే పంపేయాలి.''

''ఇంట్లోకి, చలివేంద్రానికి సరిపోగా ఇంకా బయట వాళ్ళకు్కూడా ఎక్కడ సరిపోతయ్?'' అంటూ రాగాలు తీసిన వర్ధనమ్మగారి వైపు అయోమయంగా చూశారు కొడుకు-కోడలు. ●

## తెలుగు కళా సమితి (న్యూ జెర్సీ) చిన్న కథల పోటీలో రు. 200/-లు గెలుచుకున్న రచన

---

## ఫ్లాష్ బ్యాక్

### లవ్ బాలూ 'లావు' బాలూ



స్వరంలో భాస్వరం నింపుకున్న గంధర్వ గాయకుడు శ్రీ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గురించి తెలియని వారెవరూ వుండరు. ఆయన గాయకుడుగా ఎంతటి ప్రతిభాశాలో, వ్యక్తిగానూ అంతటి ఉన్నతుడు. 'బాలూ' గాన మాధుర్యానికి అచ్చెరువొంది, ఆనందించి ఆపై అభిమానించిన ఒక పదహారేళ్ల అమ్మాయి 'బాలూ'ను చూడాలని సరాసరి మద్రాసు వెళ్ళేసింది. నానా తంటాలు పడి ఎలా అయితేనేం ఓ స్టూడియోలో 'బాలూ'ని చూడగలిగింది. బాలూని చూసీ చూడకుండానే ఆ అమ్మాయి కళ్ళ నుండి ఉద్విగ్నతతో, ఆపుకోని ఆనందంతో నీళ్ల చిప్పిల్లినాయి. బాలూని చూసి ఓ అలౌకికానంద స్థితిలో మునిగిపోయిన ఆ అమ్మాయి వెను వెంటనే తేరుకొని 'బాలూ' దగ్గరికి వచ్చి 'ఐ లవ్ యూ బాలూ'! అంటూ చెప్పిందట. ఆ అమ్మాయి ఆనందోద్వేగాన్ని సజల నయనాలతో వీక్షించిన బాలసుబ్రహ్మణ్యం ఆ అమ్మాయి భుజాన్ని ప్రేమగా తడుతూ, ''చూడమ్మా! అయ్ లవ్ యూ బాలూ' అనకూడదు. ఈ బాలూ 'లవ్ బాలూ' కాదు 'లావు బాలూ' మాత్రమే'' అని తనదైన చమత్కార ధోరణిలో అన్నాడట.

—సేకరణ: జ్యోతి